సాక్షి
వికారాబాద్

ఆదివారం | 26 | మే | 2024



క్లిక్ చేస్తే అంతే!

బ్యాంకుల పేరుతో లింకులు ఓపెన్ చేయాలని సోషల్ మీడియా ద్వారా సందేశాలు వస్తున్నాయా? అయితే జాగ్రత్త. 8లో▸



విద్యతోనే సమానత్వం

విద్యతోనే స్త్రీ, పురుషుల మధ్య వివక్షతను తొలగించవచ్చని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వెంకటేశం అన్నారు. 8లో▸



విచారణ చేయించండి

జీపీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేయించాలని రాకొండ గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు



వికారాబాద్‌లోని గోదాంలో పుస్తకాలు

త్వరలో మండల కేంద్రాలకు..	
కావాల్సిన పుస్తకాలు	5,27,030
వచ్చినవి	3,38,810
రావాల్సినవి	1,88,220

అనంతగిరి: జిల్లాకు పాఠ్యపుస్తకాలు వచ్చాయి. పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి త్వరలో మండల రిసోర్స్ సెంటర్లకు తరలించనున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు జిల్లా స్టాక్ పాయింట్‌కు చేరాయి. ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వనున్నారు. జిల్లాకు పార్ట్ -1, పార్ట్ -2 కలిపి 7,19,410 పుస్తకాలు రానున్నాయి. ఇప్పటికే 65 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు, 70శాతం నోటు పుస్తకాలు వచ్చినట్లు బుక్ డిపో అధికారులు తెలిపారు. ప్రస్తుతం పార్ట్ -1 పుస్తకాలు జిల్లాకు చేరాయి. పార్ట్ -2 పుస్తకాలు ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మెరుగైన వైద్యం డాక్టర్ల బాధ్యత

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్



ప్రైవేటు ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్

సాక్షి ఎఫెక్ట్..

పరిగి: ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో, మెరుగైన వైద్యం అందించడం డాక్టర్ల బాధ్యత అని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్ అన్నారు. వైద్యం.. చోద్యం శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. దోమ మండల కేంద్రానికి చెందిన యాస్మిన్‌బేగం(22) చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ కూతురు చనిపోయిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వైద్య శాఖ అధికారులు పరిగిలోని శ్రీ బాలాజీ, సాయి శ్రేణిక్ ఆస్పత్రుల్లో విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చికిత్స కోసం వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం చేయాలని ఆదేశించారు. యాస్మిన్‌బేగం మృతిపై ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామన్నారు. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీహెచ్‌సీని సందర్శించిన వైద్యాధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సుధీర

కొత్తూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర అన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇమ్యునైజేషన్, వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్లు దామోదర్, హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది చిట్టిబాబు, రవికుమార్, అనసూయ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలు

నకిలీల బెడద

మార్కెట్‌లోకి యథేచ్ఛగా నకిలీ విత్తనాలు

- కర్ణాటక నుంచి అక్రమ రవాణా
- రైతులను నట్టేట ముంచుతున్న అక్రమార్కులు
- అధిక దిగుబడి పేరుతో దగా
- పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్న అన్నదాతలు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు
- జిల్లాలో 1.80 లక్షల హెక్టార్లలో పంటల సాగు

వికారాబాద్/బషీరాబాద్: మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద ఏడాదికేడాది పెరుగుతూనే ఉంది. మంచి విత్తనాలు ఏవో.. నకిలీవి ఏవో గుర్తించ లేక కర్షకులు నష్టాలను చవిచూస్తున్నారు. అన్నం పెట్టే అన్నదాతలు అక్రమార్కుల చేతుల్లో దోపిడీకి గురవుతున్నారు. బ్రాండెడ్ విత్తనాల పేరుతో రైతుల నుంచి వేల రూపాయలు దండుకొంటున్నారు. త్వరలో వానాకాలం సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో అక్రమార్కులు కర్ణాటక నుంచి ముందుగానే నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకొని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకున్నట్లు సమాచారం.

సాగుకు సన్నద్ధం

జిల్లా ప్రజలకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు. సుమారు 8 లక్షల మంది రైతులు వానాకాలం సీజన్‌లో 1.80 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. ప్రతి ఏటా ప్రభుత్వం అరకొరగానే సబ్సిడీ విత్తనాలు సరఫరా చేస్తోంది. అందులోనూ ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తి విత్తనాలను సరఫరా చేయకపోవడంతో రైతులు వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. మెజార్టీ రైతులు.. పంటల మీద డబ్బులు చెల్లిస్తామని విత్తనాలు, ఎరువులు ఉద్దెర రూపంలో కొంటుంటారు. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. కర్ణాటక నుంచి బైక్‌లు, జీపుల్లో నకిలీ విత్తనాలు తెచ్చి తాండూరు లాంటి పట్టణాల్లో భద్రపరిచినట్లు తెలిసింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో విత్తనాలను విక్రయిస్తున్నారు. విత్తిన తర్వాత గానీ తాము మోసపోయామని రైతులు తెలుసుకోలేకపోతున్నారు.

నకిలీ విత్తనాల పట్టివేత

బషీరాబాద్: మండలంలో శనివారం భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. కర్ణాటక నుంచి తెచ్చి ఎక్మాయి పల్లిలో విక్రయిస్తుండగా ఎస్‌ఐ రమేష్, ఏఓ సూర్యప్రకాశ్ దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లికి చెందిన వెంకటరాములు, గుల్బర్గా జిల్లా మద్దికంటికి చెందిన బోయింది విఠలప్ప ఎక్మాయి పల్లిలో రైతులకు పత్తి విత్తనాలు విక్రయించారు. విషయం తెలుసుకున్న తాను ఏఓ సూర్యప్రకాశ్ గ్రామానికి చేరుకొని విత్తనాలను పరిశీలించాం. నకిలీవని తేలడంతో నాలుగు క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నాం. నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

నష్టాలు ఇలా..

నకిలీ విత్తనాలు విత్తితే పంట ఎదుగుదల ఉండదు. మొక్క పెరిగిన తర్వాత కాత కాయదు. తెగుళ్లు సోకడం వంటి సమస్యలు ఎదురవుతాయి. నకిలీల నివారణకు అధికారులు ఫెర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించాలి. కానీ నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. మేలు రకం విత్తనాల ప్యాకెట్లలో నకిలీ విత్తనాలను ఉంచి లోకల్‌గా తయారు చేసిన విత్తనాలను విక్రయిస్తున్నారు. గతంలో బషీరాబాద్ మండలంలో సుమారు 15వందల ఎకరాల్లో సాగు చేసిన పత్తి విత్తనం నకిలీవని తేలింది. ఓ ప్రముఖ విత్తన కంపెనీకి చెందిన విత్తనాలను వేసిన రైతులకు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 4 నుంచి 5 క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చిందని రైతులు తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, సదరు కంపెనీకి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. దీంతో ఆ రకం పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. వాణిజ్య పంట విత్తనాలను ప్రభుత్వమే రాయితీపై అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

నామమాత్రపు చర్యలు

గతేడాది ఫెర్టిలైజర్ దుకాణాల నుంచి సేకరించిన విత్తన శాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పంపారు. 10 దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తేలింది. ఆ దుకాణ యజమానులపై నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మూడు చోట్ల తనిఖీలు చేశారు. నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. స్టాప్ సెల్‌తో సరిపెట్టారు. కఠిన చర్యలు తీసుకునే విషయంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశామని చెబుతుండగా.. ఎక్కడా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

చర్యలు తీసుకోవాలి



మార్కెట్‌లో ప్రతి ఏటా కొత్త కొత్త బ్రాండ్ల పేరిట నకిలీ విత్తనాలు వస్తున్నాయి. గతేడాది 20 ఎకరాల్లో మల్లిక 207 రకం పత్తి విత్తనాలు విత్తా. పంట ఏపుగా పెరిగినా కాత మాత్రం పూర్తి స్థాయిలో రాలేదు. ఒక్కో పత్తి చెట్టుకు 50 కంటే తక్కువ కాయలు మాత్రమే కాశాయి. వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకొని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. విత్తనం విత్తాక గాని అవి నకిలీవని గుర్తించలేక పోయాం. నకిలీ విత్తనాలను ప్రభుత్వం పూర్తిగా అరికట్టాలి.

– సురేష్, రైతు, మంతట్టి

మొలక శాతం చూసి కొనాలి



వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి. విత్తన లైసెన్సు ఉన్న దుకాణంలోనే కొనాలి. ప్యాకెట్‌పైన మొలక శాతం 75 కంటే ఎక్కువ ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. విత్తు వేయక ముందే కొన్ని శాంపుల్స్ పొలంలో నాటి చూడాలి. మొక్క పెరుగుదలను చూసి విత్తనాలు కొనాలి. విత్తనాలు కొన్న రశీదు, ప్యాకెట్ కవరును పంట దిగుబడి వచ్చే వరకు జాగ్రత్తగా దాచుకోవాలి. నకిలీల నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. ఏ కంపెనీ సీడ్ అయినా ముందుగా నమూనా సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తాం. అందులో నాణ్యత తేలితేనే విక్రయానికి అనుమతి ఇస్తున్నాం.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి



కొటాలగూడెం పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పనుల్లో భాగస్వాములవ్వండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన
- పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశం

అనంతగిరి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో మహిళలు భాగస్వాములు కావాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్ మండలం కొంపల్లి, రామయ్యగూడ, కొటాలగూడ, కామారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా స్కూళ్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సంఘాలపై ఉన్న నమ్మకంతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతలను వారికి అప్పగించిందని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. మంచి నీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, భవన మరమ్మతు పనులు, విద్యుత్ సదుపాయం కల్పించాలని సూచించారు. త్వరలో వర్షాలు పడనున్న నేపథ్యంలో లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని కొటాలగూడ పాఠశాలలో చేపడుతున్న పనులపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శాంతాబాయి, పనులు చేపడుతున్న బాల్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో వికారాబాద్ మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ సుధీర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, మండల విద్యాధికారి బాబుసింగ్, ఎంపీఓ నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు రహిమాబేగం, స్వరూప, శాంతాబాయి, సుజాత పాల్గొన్నారు.

నెలాఖరులోగా పనులు పూర్తవ్వాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల జిల్లా స్పెషల్ ఆఫీసర్ అశోక్

బంట్వారం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల చివరి నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తికావాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ అశోక్ ఆదేశించారు. శనివారం ఎంఈఓ చంద్రప్పతో కలిసి కోట్‌పల్లి మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడమే అమ్మ ఆదర్శ పాఠశాలల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పనుల్లో జాప్యం జరగరాదని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, అమ్మ ఆదర్శ పాఠశాలల ఏఈ సిద్ధార్థ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షులు, సీఆర్పీ నర్సింలు పాల్గొన్నారు.



మోత్కుపల్లి పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న అశోక్



మారేపల్లిలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

శభాష్ కల్పన

- స్థానికులు, నెటిజన్ల అభినందనలు
- చైన్‌స్నాచర్లను ధైర్యంగా ఎదుర్కొన్న తల్లీకూతుళ్లు
- నిందితుల కోసం గాలింపు



చైన్ స్నాచర్లపై తిరగబడిన తల్లీకూతుళ్లు

పహాడీషరీఫ్: కళ్లల్లో కారం నీళ్లు చల్లి, కర్రతో దాడి చేసి.. మెడలోని పుస్తెల తాడును లాక్కునేందుకు ప్రయత్నించిన దుండగులను ధైర్యంగా ఎదిరించిన తల్లీకూతుళ్లపై స్థానికులు, నెటిజన్లు అభినందనల వర్షం కురిపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయం పిల్లలతో కలిసి తుక్కుగూడ అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన మంఖాల్ వాసి గడ్డమీది కల్పన(32) కళ్లలో కారం కలిపిన నీళ్లు చల్లిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కల్పనతో పాటు ఆమె కూతురు లక్ష్మీప్రసన్నపై కూడా కర్రతో దాడి చేశారు. ఈ సమయంలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన కల్పన ఆగంతకులతో తలపడి.. వారి బైక్ తాళాలు లాక్కుంది. ఊహించని ఎదురుదాడితో నిర్ఘాంతపోయిన దుండగులు బైక్‌ను అక్కడే వదిలేసి బంగారు గొలుసుతో పరారయ్యారు. గాయపడ్డ తల్లీకూతుళ్లు శుక్రవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. నిందితులు వదిలి వెళ్లిపోయిన బైక్‌కు సంబంధించిన నంబర్ నకిలీదని పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన డీఐ సుధీర్‌కృష్ణ, డీఎస్సై భాస్కర్ నిందితులకు సంబంధించి ప్రాథమిక సమాచారం సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'పల్లె ప్రకృతి'లో అలసత్వం వద్దు

- మొక్కలు ఏపుగా, దట్టంగా ఉండాలి
- డీపీఓ జయసుధ

పెద్దేముల్: పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, క్రిమిటోరియాలు, క్రీడా ప్రాంగణాలు, కంపోస్టు షెడ్ల నిర్వహణలో అలసత్వం వహించరాదని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సూచించారు. శనివారం మండలంలోని మారేపల్లి, జనగాం, పెద్దేముల్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వన నర్సరీలు, శ్మశానవాటికలు, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఏపుగా పెరగాలని, దట్టంగా ఉండాలని, గడ్డి ఉండరాదని సూచించారు. ఇక్కడికి వచ్చే జనం కోసం బెంచీలు వేయాలన్నారు. మొక్కలకు తరచూ నీరు పోయాలని ఆదేశించారు. నర్సరీలోని ప్రతి బ్యాగులో మొక్క ఉండాలన్నారు. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. శ్మశాన వాటికల్లో నీటి వసతి, విద్యుత్ ఉండాలన్నారు. క్రీడా ప్రాంగణాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తడి, పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. కంపోస్టు ఎరువులు తయారు చేసి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. త్వరలో వానాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే సరి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చుడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు నర్సింహారెడ్డి, యశ్వంత్, మల్లికార్జున్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల తగాదా

తలకొండపల్లి: భూమి విషయంలో అన్నదమ్ములు గొడవ పడిన సంఘటన మండల పరిధిలోని పాత కోట తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన దీప్లా, శంకర్‌లు అన్నదమ్ములు. వీరి తండ్రి బద్యాకు ఇద్దరు భార్యలు. పెద్ద తల్లి కుమారుడు దీప్లా, చిన్న తల్లి కుమారుడు శంకర్. బద్యాకు 8 గుంటల పొలం ఉంది. తండ్రి చనిపోకముందే దీప్లా 8 గుంటల భూమిని తన పేరు మీద పట్టా చేయించుకున్నాడు. శంకర్ ఆ భూమిలో నాకు హక్కు ఉందని సోదరుడితో తగాద పెట్టుకున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో ఇరువురి మధ్య రాజీ కుదిరింది. దీప్లా ఒక గుంట భూమిని శంకర్‌కు ఇచ్చాడు. ఆ భూమిలో శంకర్ ఈ మధ్య ఇళ్లు నిర్మించుకున్నాడు. నా భూమిలో శంకర్ అక్రమంగా ఇళ్లు నిర్మించాడని దీప్లా శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

సిలిండర్ రీఫిల్లింగ్ ముఠా గుట్టు రట్టు

- జనావాసాల నడుమ నిర్వహిస్తున్న వైనం
- జల్‌పల్లిలో ఎస్‌ఓటీ పోలీసుల దాడులు
- 91 సిలిండర్లు, ఫిల్లింగ్ సామగ్రి స్వాధీనం
- ఒకరి అరెస్ట్, పరారీలో మరొకరు



సిలిండర్లతో నిందితుడు షేక్ రహమాన్

పహాడీషరీఫ్: జనావాసాల నడుమ ప్రమాదపుటంచున ప్రైవేట్ గ్యాస్‌ను భారత్, ఇండేన్ కమర్షియల్ సిలిండర్లలోకి ఫిల్లింగ్ చేస్తున్న ముఠా గుట్టును మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు శనివారం రట్టు చేశారు. ఏకంగా ఓ గోడౌన్‌నే ఏర్పాటు చేసుకొని కనీస జాగ్రత్తలు పాటించకుండా రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 91 గో గ్యాస్, భారత్, ఇండేన్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టకు చెందిన షేక్ రహమాన్(33), బబ్లులు కొన్నాళ్లుగా జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఓ గోడౌన్‌ను అద్దెకు తీసుకొని అందులో గుట్టు చప్పుడు కాకుండా ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. 'గో గ్యాస్' కంపెనీ సిలిండర్ల నుంచి వాణిజ్యానికి వినియోగించే భారత్, ఇండేన్ సిలిండర్లలోకి ఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకే ప్రదేశంలో ఇంత భారీ ఎత్తున రీఫిల్లింగ్ చేస్తున్న క్రమంలో ఏదైనా జరగరానిది జరిగితే ఊహాకందని స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, ఎస్సై రాజుల బృందం శనివారం దాడులు నిర్వహించి ఒక డిజిటల్ తూకం, 91 సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్‌కు వినియోగించే 13 రీఫిల్లింగ్ రాడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రహమాన్‌ను తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు. మరో నిందితుడు బబ్లూ పరారీలో ఉన్నాడు.

91 సిలిండర్ల స్వాధీనం

ఈ దాడుల సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 'గో గ్యాస్' కమర్షియల్ ఖాళీ సిలిండర్లు–34, నిండు సిలిండర్లు–13, భారత్ గ్యాస్ కమర్షియల్ నిండు సిలిండర్లు–15, ఖాళీ సిలిండర్లు–14, ఇండేన్ గ్యాస్ కమర్షియల్ ఖాళీ సిలిండర్లు–15గా ఉన్నాయి.

స్థానిక పోలీసులకు తెలియదా?

అక్రమ వ్యాపారాలకు కేంద్ర బిందువుగా ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ వ్యాపారాలు స్థానిక పహాడీషరీఫ్ పోలీసులకు తెలియకుండానే జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పరస్పర సహకారం కారణంగానే మిన్నకుండి పోతున్నారన్న విమర్శలున్నాయి. ఎస్‌ఓటీ పోలీసులు వచ్చి దాడులు చేసేంత వరకు కూడా స్థానిక పోలీసులు తెలియనట్లుగా ఉండడమే ఈ ఆరోపణలకు ఊతమిచ్చేలా ఉంది.

క్లుప్తంగా

ఇంటి హక్కుపత్రానికి ఫోర్జరీ

- పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దౌల్తాబాద్‌: మండలంలోని కుదురుమళ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటప్ప పంచాయతీ కార్యదర్శి రాధ సంతకాన్ని ఫోర్జరీ చేసి కొడంగల్‌ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో ఇంటి యాజమాన్య హక్కుపత్రాన్ని పొందారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధ విషయం తెలుసుకుని శనివారం డీఎల్‌పీఓ శంకర్‌నాయక్‌కు వివరించారు. అయితే సదరు వెంకటప్పపై పంచాయతీ కార్యదర్శులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్‌ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు 1969 జీఓ ప్రకారం ఇంటి యాజమాన్య హక్కు పత్రాన్ని మంజూరు చేయవద్దని డీఎల్‌పీఓ సూచించారు.

టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

యాలాల: మండల పరిధిలోని కోకట్‌ శివారులో గల టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో జూనియర్‌ ఇంటర్‌లో చేరుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో ఉండే నాన్‌ సీఓఈ విద్యాలయంలో జూనియర్‌ ఇంటర్‌లో చేరుటకు ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 24 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. జూనియర్‌ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వృత్తివిద్యా కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

యాచారం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన శివకుమార్‌ ఈ నెల 23న నగరంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి శనివారం వచ్చి చూడగా తలుపు తీసి ఉంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.50 వేల విలువైన ఆభరణాలు, రూ.10 వేల నగదును తీసుకెళ్లినట్లు గుర్తించారు. శివకుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

భార్య కళ్లెదుటే గల్లంతు

మీర్‌పేట: దంపతుల మధ్య కలహాలతో భార్య చూస్తుండగానే భర్త చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నందనవనం భూపేష్‌గుప్తా నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్‌ జాదవ్‌ ప్రవీణ్‌(30), కమల భార్యాభర్తలు. ఇరువురి మధ్య గొడవ జరగడంతో ప్రవీణ్‌ ఇంటికి వెళ్లలేదు. ఈ క్రమంలో మాట్లాడుకునేందుకు భార్యాభర్తలతో పాటు ప్రవీణ్‌ స్నేహితుడితో కలిసి శనివారం మీర్‌పేట మంత్రాల చెరువు వద్దకు వచ్చారు. భార్యాభర్తల మధ్య మాట మాట పెరగడంతో ప్రవీణ్‌ ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులోకి దూకాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు.

క్లిక్‌ చేస్తే అంతే!

సాంకేతికరంగం కొత్త పుంతలు తొక్కుతున్నా కొద్దీ నేరాలు సైతం అదే రీతిలో పుట్టుకొస్తున్నాయి. ఇదివరకు మీకు గిఫ్ట్‌ వచ్చింది.. సమాచారం చెప్పండంటూ మాయమాటలతో లూటీ చేసేవాళ్లు. ప్రస్తుతం వాటికి స్వస్తి చెప్పి.. తెలిసిన వ్యక్తి నంబర్‌ నుంచి 'ఎస్‌బీఐ' పేరుతో సందేశాలు పంపి ఘరానా మోసాలకు కేటుగాళ్లు తెరలేపుతున్నారు.

- బెంబేలెత్తిస్తున్న 'ఎస్‌బీఐ' సందేశం
- సైబర్‌ నేరగాళ్ల నయా మోసం
- జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు



పోలీస్‌ స్టేషన్‌, దోమ


దోమ: బ్యాంకుల పేరుతో లింకులు ఓపెన్‌ చేయాలని సోషల్‌ మీడియా ద్వారా సందేశాలు వస్తున్నాయా? అయితే తస్మాత్‌ జాగ్రత్త అని పోలీసులు చెబుతున్నారు. గత కొంత కాలంగా సైబర్‌ నేరస్తులు నయా దందాకు తెరలేపి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. వాట్సాప్‌లో ఎస్‌బీఐ పేరుతో కొంత మంది సైబర్‌ కేటుగాళ్లు లింకులను పంపిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. దీనికి ఎక్కువగా సోషల్‌ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారినే ఎంపిక చేసుకొని ఎస్‌బీఐ పేరుతో లింకులు పంపిస్తున్నారు. వాటిని ఓపెన్‌ చేయగానే తమ బ్యాంకు ఖాతాను నగదును తరలిస్తున్నారు.

ఫోన్‌కాల్స్‌, లింకుల పేరుతో..

సోషల్‌ మీడియా ఎప్పుడైతే యాక్టివ్‌గా తయారైందో అప్పటి నుంచి సైబర్‌ నేరగాళ్లు నయాదందా వైపు మొగ్గు చూపుతున్నారు. వివిధ వాట్సాప్‌ గ్రూప్‌లలో బ్యాంకుల లింకులు, ఫోన్‌కాల్స్‌, నకిలీ ఫేస్‌బుక్‌ ఖాతాల పేరుతో సైబర్‌ నేరగాళ్లు సామాన్య ప్రజలను మోసాలకు గురిచేస్తున్నారు. వాటిని ఓపెన్‌ చేయడం ద్వారా ఓటీపీ అడుగుతూ అకౌంట్‌లో ఉన్న డబ్బులను దోచుకుంటున్నారు. దీంతో ఇటీవలే ఎస్‌బీఐ పేరుతో వాట్సప్‌లలో లింకులు రావడంతో కొంత మంది సోషల్‌ మీడియా పట్ల అవగాహన లేక ఓపెన్‌ చేసి సైబర్‌ నేరగాళ్ల ఊబిలో పడ్డారు. ఈ క్రమంలో ఓటీపీ సహాయంతో అకౌంట్‌లో ఉన్న డబ్బులను కాజేసేశారు. పోలీసులతో అప్రమత్తమైన ప్రజలు లింక్‌లను ఓపెన్‌ చేయకుండా తగు జాగ్రత్తలు పడుతున్నారు.

రూ.పది లక్షలు దండుకొని..

అమాయక ప్రజలను మోసం చేస్తూ సైబర్‌ నేరగాళ్లు రూ.లక్షలు దండుకుంటున్నారు. దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ ఆయా గ్రామాలలోని కొందరు వ్యక్తులు సైబర్‌ కేటుగాళ్ల బారిన పడ్డారు. 2021లో ఏడుగురు, 2022లో 13 మంది, 2023లో 10 మంది, 2024లో 9 మంది సైబర్‌ మోసాలకు గురవ్వగా.. వారందరూ రూ.10 లక్షల వరకు డబ్బులు పోగొట్టుకున్నట్లు సమాచారం. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఇటీవలే మోత్కూర్‌ గ్రామానికి చెందిన ఓ రైతుకు రాజస్తాన్‌ చెందిన వ్యక్తి బర్రెలు బాగున్నాయి తీసుకోవాలని వీడియోలు పెట్టాడు. నమ్మిన సదరు రైతు తీసుకురావాలని కోరాడు. ఈ క్రమంలో రైతు వద్ద నుంచి రూ.లక్ష ఇరవై వేలు వేయించుకొని ఉడాయించాడు.



ఎస్‌బీఐ పేరుతో సోషల్‌ మీడియాలో చక్కర్లు కొడుతున్న లింకులు

జాగ్రత్త పడితే మేలు



కొందరు కేటుగాళ్లు వాట్సాప్‌ గ్రూప్‌లలో ఎస్‌బీఐ పేరుతో లింకులను పంపించడమే కాకుండా ఫోన్‌కాల్స్‌ ద్వారా ఓటీపీలను అడుగుతూ డబ్బులను దోచుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాటి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అనవసర లింకులు ఓపెన్‌ చేయొద్దు.

– రఫీక్‌ పాషా, మాజీ ఉపసర్పంచ్‌, బొంపల్లి

అప్రమత్తంగా ఉండాలి



గ్రామాలలోని ప్రజలు సైబర్‌ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వివిధ కంపెనీల పేరుతో ఫోన్‌ కాల్స్‌, వాట్సాప్‌లలో లింకులు రావడంతో అమాయక ప్రజలు ఓపెన్‌ చేస్తున్నారు. వెంటనే 1930కి కాల్‌ చేసి కేసు రిజిస్టర్‌ చేసుకోవాలి. అప్పుడే రికవరీకి అవకాశం ఉంటుంది.

– ఆనంద్‌ కుమార్‌, ఎస్‌ఐ, దోమ

ఏకరూప దుస్తులు త్వరగా కుట్టండి

డీఆర్‌డీఓ శ్రీనివాస్‌



దుస్తులు కుట్టుతున్న మహిళతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

మోమిన్‌పేట: విద్యార్థులకు ఏకరూప దుస్తులు త్వరగా కుట్టాలని మహిళ సమాఖ్య సభ్యులను డీఆర్‌డీఓ శ్రీనివాస్‌ ఆదేశించారు. శనివారం మండల కేంద్రం మహిళ సమాఖ్య కార్యాలయం, మేకవనంపల్లి కుట్టు మిషన్‌ కేంద్రాలను ఆయన సందర్శించారు. మండల మహిళ సమాఖ్య కార్యాలయానికి 3,851 ఏకరూప దుస్తులను కుట్టేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. మండలంలోని మోమిన్‌పేట, మేకవనంపల్లి, టేకులపల్లి, మొరంగపల్లి, చీమల్‌దరి గ్రామాలలో డ్వాక్రా మహిళలతో ఏకరూప దుస్తులను కుట్టిస్తున్నారని ఆయన చెప్పారు. ఒక దుస్తును కుట్టేందుకు ప్రభుత్వం రూ.75లు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి రూ.50లు ఉండగా ఇటీవలే దాన్ని రూ.75లకు ప్రభుత్వం పెంచిందన్నారు. డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేసి ఇవ్వాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమానత్వం సాధ్యం

జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్‌ వెంకటేశం



సమావేశం అనంతరం బెలూన్లు ఎగురవేస్తున్న బాలికలు

అనంతగిరి: విద్యతోనే స్త్రీ, పురుషుల మధ్య వివక్షతను రూపుమాపి సమానత్వం సాధించగలమని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్‌ వెంకటేశం అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లోని స్త్రీశక్తి భవన్‌లో ఎంవీఎఫ్‌ ఆధ్వర్యంలో తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో కిశోర బాలిక సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆడపిల్లల విద్య, జెండర్‌ సమానత్వంపై అవగాహన పెంచుకుని వారి సమస్యలను వారే పరిష్కరించుకుంటున్న తీరు అభినందనీయమన్నారు. ఆడపిల్లల విద్యకు అడ్డంకిగా ఉన్న సమస్యలలో ప్రధానంగా గ్రామాల్లో నుంచి బస్సు సౌకర్యం, కళాశాలలు అందుబాటులో లేకపోవడం వంటివి అన్నారు. వీటిని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వికారాబాద్‌ మండలంలో ఏర్పాటు చేసుకున్న కిశోరబాలిక సంఘాలను ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయుటకు ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్‌ కోఆర్డినేటర్‌ భాస్కర్‌, జిల్లా చైల్డ్‌ ప్రొటెక్షన్‌ విభాగం ఇన్‌చార్జి శ్రీకాంత్‌, చైల్డ్‌లైన్‌ కోఆర్డినేటర్‌ రాజునాయక్‌, ఎంవీ ఫౌండేషన్‌ సిబ్బంది శ్రీనివాస్‌, వెంకటయ్య, ఆశలత, ఉమాదేవి, బాలిక సంఘాల అధ్యక్షురాలు జ్యోతి, కృప, పావని, హర్షణ, రవళి ఆయా గ్రామాలకు చెందిన కిశోరబాలికలు పాల్గొన్నారు.



చిట్టిగిద్దలో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్‌ తీగలు

ఇళ్ల మధ్య యమపాశాలు!

నవాబుపేట: ఇళ్లకు అతి సమీపంలో ఉన్న విద్యుత్‌ తీగలు వేలాడుతూ నిత్యం ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. అయినా అధికారులెవరూ అటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలోని మైనార్టీ, బీసీ కాలనీల్లో ఇళ్లకు ఆనుకొని స్తంభాలు ఉండటం, ఇళ్లకు అతి సమీపం నుంచే విద్యుత్‌ వైర్లు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీవాసులు భీతిల్లుతున్నారు. ఈ విషయంపై విద్యుత్‌ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తిని చితకబాది..

అనంతగిరి: దొంగతనానికి యత్నించిన వ్యక్తిని పట్టుకుని, చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి వికారాబాద్‌ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అప్సర్‌జంగ్‌బాగ్‌ కాలనీలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో దొంగతనం చేయడానికి ప్రయత్నించగా.. గమనించిన స్థానికులు దొంగను పట్టుకుని చితకబాదారు. పోలీసులకు సమాచారం అందించి, పట్టించారు. అన్ని కోణాల్లో కేసు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

శ్మశానవాటికలో మోటారు చోరీ

దోమ: శ్మశాన వాటికలో ఉన్న మోటార్‌ను అపహరించిన దుండగులను గుర్తించి పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని దాదాపూర్‌ పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి కోరారు. శనివారం గ్రామ పంచాయతీలో 314 సర్వే నంబర్‌లో శ్మశానవాటికను ఏర్పాటు చేశారు. అక్కడ నీటి వసతిని కల్పించేందుకు గతంలో బోరు మోటార్‌ను బిగించారు. వాటిని పరిశీలించేందుకు వెళ్లగా.. గుర్తు తెలియని వ్యక్తులు మోటార్‌, పంపును దొంగిలించినట్లు గుర్తించారు. వెంటనే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనాథలకు పండ్ల పంపిణీ

శంషాబాద్‌: కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు గుర్రం రణధీర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రితోపాటు అనాథ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్ర మంలో యువజన కాంగ్రెస్‌ జిల్లా నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్‌ (మిట్టు) నజీరుద్దీన్‌, సుబోద్‌,పాల్సన్‌, సంజీవ్‌రెడ్డి, నజ్మద్దిన్‌, ప్రశాంత్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, గణేష్‌ నాయక్‌, చిరంజీవిగౌడ్‌, ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. గుంతలమయం

దౌల్తాబాద్‌ మండలంలోని సుల్తాన్‌పూర్‌ గ్రామం నుంచి నాగసార్‌ వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు, గుముడాల నుంచి బిచ్చాల వెళ్లే బీటీ రహదారి నరకానికి నకళ్లుగా మారాయి. అభివృద్ధికి సోపానాలుగా భావించే రహదారులను ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ రహదారులపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణానికి అవరోధంగా మారాయి. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రోడ్లపై ప్రయాణిస్తున్న వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గుముడాల-బిచ్చాల నాగసార్‌ రహదారి దుస్థితి

యథేచ్ఛగా పార్కు రోడ్డు కబ్జా



పార్కుకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి

పరిగి: పట్టణ కేంద్రంలో రియల్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్‌కు రిజిస్ట్రేషన్‌ చేయించిన పార్క్‌కు వెళ్లే రోడ్డునే ఏకంగా కబ్జా చేశారు. దీంతో పార్కుకు వెళ్లే ప్రజలకు, వెనుకాల ఉన్న భూములకు వెళ్లే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ కేంద్రంలోని లక్ష్మీనగర్‌ వెంచర్‌లో పార్కుకు వెళ్లే స్థలాన్ని కొందరు రియల్టర్లు రోడ్డుకు అడ్డంగా మట్టి వేసి ఆక్రమిస్తున్నారు. తమకు ఇష్టమొచ్చినట్టు చేసుకుంటామని సదరు వ్యక్తులు స్థానికులను బెదిరిస్తున్నారు. రోడ్డుపై వేసిన మట్టిని తొలగించాలని ప్రజలు ఎంత విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం మున్సిపల్‌ అధికారులకు తెలిసినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని, రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఉద్యోగి సహకారం అవసరం



ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేస్తున్న డీఎం

ఆర్టీసీ పరిగి డీఎం కరుణశ్రీ

పరిగి: ఆర్టీసీ అభ్యున్నతికి ప్రతి ఉద్యోగి సహకారం ఎంతో అవసరమని ఆ సంస్థ పరిగి డిపో మేనేజర్‌ కరుణశ్రీ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే నంబర్‌ వన్‌ డిపోగా పరిగిని ఉంచాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. లాభాలు తీసుకువచ్చిన ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. అంతే కాకా డ్రైవర్లు కేఎంపీఎల్‌పై దృష్టి సారించి ఎక్కువ కిలోమీటర్లకు తక్కువ ఇంధనం ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్‌

WANTED

- హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640258899/ 9640468899 [H-799885]
- షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్‌ అసిస్టెంట్స్‌, నర్సులు, లేడీ కేర్‌ టేకర్స్‌, ఆయాలు, డ్రైవర్స్‌, భార్యాభర్తలు కావలెను. ఫోన్‌: 9391036931, 9246585901 [HA-14041]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌/ డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ప్రయాణం.. పూలదారి



తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిపై అలుముకున్న పూల చెట్లు

పెద్దేముల్‌: మండలంలోని తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారి పూలదారిగా మారింది. పెద్దేముల్‌ గ్రామం నుంచి తాండూరు వెళ్లే మార్గంలో సుమారు కిలో మీటరు దూరం ప్రధాన రహదారికి ఇరువైపులా పూల చెట్లు అల్లుకున్నాయి. సంగారెడ్డి, వికారాబాద్‌, జహిరాబాద్‌, కోటపల్లి, బంట్వారం, నాగులపల్లి, అడ్కిచెర్ల వెళ్లే ప్రయాణికులు పూల దారిని చూసి ఆస్వాదిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

భర్తే హత్య చేశాడంటూ మృతురాలి బంధువుల ఆరోపణ



పారిజాత (ఫైల్‌)

అబ్దుల్లాపూర్‌మెట్‌: అనుమానాస్పద స్థితిలో గృహిణి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌ మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు లు, మృతురాలి బంధువులు తెలిపి న వివరాల ప్రకారం.. మండలంలోని అనాజ్‌పూర్‌ గ్రామానికి చెందిన నార్లకొండ మహేందర్‌కు ఇబ్రహీంపట్నం మండలం మన్యగూడ చెందిన పారిజాత(39)తో 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం అయిన రెండేళ్ల నుంచే దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి ఇద్దరికీ సర్దిచెప్పారు. అయినప్పటికీ.. మహేందర్‌ మద్యానికి బానిసై పారిజాతను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. శుక్రవారం రాత్రి పారిజాత పురుగు మందు తాగిందని ఆమె కుటుంబసభ్యులకు మహేందర్‌ సోదరుడు జంగమయ్య తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. హుటాహుటిన బంధువుల తరలివెళ్లగా పారిజాత విగత జీవిగా పడి ఉంది. భర్త వేధింపులు తాళలేక తన సోదరి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి సోదరుడు సురేష్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. భర్తే భార్యను చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడంటూ మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ లేక.. జీవాలు బలి!

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్‌ లేక ప్రమాదాలు
- కరెంటు కాటుకు పాడి రైతుల ఆందోళన
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



బొంరాస్‌పేట: మృతిచెందిన గేదెలు



తొప్పెర్లగడ్డ సమీపంలో చిన్నపాటి గాలికి విరిగిపడిన విద్యుత్‌ స్తంభం

యాలాల: ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్‌ లేకపోవడంతో తరచూ పశువులు కరెంటు కాటుకు బలవుతున్నాయి. ఇలాంటి ఉదంతాలు ఇటీవల పెరగడంతో పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనోపాధి కోల్పోతున్నామంటూ లబోదిబోమంటున్నారు. దీంతో పాటు చిన్నపాటి గాలికే ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్‌ సరఫరాకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తరచూ ఘటనలు

మండల పరిధిలో బాగాయిపల్లి, రాఘవపూర్‌, యాలాల, లక్ష్మీనారాయణపూర్‌, దౌలాపూర్‌లో సబ్‌ స్టేషన్లు ఉన్నాయి. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్ల ద్వారా గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు కరెంటు సరఫరా అవుతుంది. కాగా చాలా గ్రామాల్లో వ్యవసాయ అవసరాలకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా గ్రామాలకు దూరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌ బుడ్డీల వద్ద ఎలాంటి రక్షణ సౌకర్యాలు లేకపోవడంతో మూగజీవాలు కరెంటు కాటుకు బలవుతున్నాయి. మరికొన్ని చోట్ల ఎర్తింగ్‌ సమస్య కారణంగా మేత మేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందిన మూగజీవాలు లెక్కకుమించినవే. ప్రతి రోజు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతో విఫలం అవుతున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో పగిడిపల్లి, ముకుందాపూర్‌, అన్నసాగర్‌, నాగసముందర్‌, రాస్నం తదితర గ్రామాల్లో కరెంటు షాకుతో మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. దీనికి ప్రధాన కారణం ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాద నివారణ చర్యలు లేకపోవడమే. అయినప్పటికీ అధికారులు కంచె ఏర్పాటు చేసే విషయంలో నిర్లక్ష్యంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు చిన్నపాటి వానగాలికి విద్యుత్‌ స్తంభాలు విరిగిపడి, తీగలు తెగుతున్నాయి. ఇటీవల నాగసముందర్‌ శివారులో గాలికి విద్యుత్‌ తీగలు తెగిపడటంతో ఓ ఆవు మృత్యువాతపడింది. ఈ విషయంలో ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టిసారించి ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో కంచెను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

తీగలు తెగి గేదెలు మృత్యువాత

బొంరాస్‌పేట: బలమైన ఈదురు గాలులతో పొలంలో విద్యుత్‌ తీగలు తెగిపడటంతో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈసంఘటన మండల పరిధిలోని దుప్‌చర్లలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అవుసవోని కిష్టప్పకు రూ.2లక్షల విలువ చేసే రెండు గేదెలు పట్లోళ్ల శామ్‌రెడ్డి పొలంలో ఉన్న విద్యుత్‌ తీగలు తెగి మృత్యువాత పడ్డాయి. జీవనోపాధి కోల్పోయానని తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు వాపోయారు. ఇదివరకే వేలాడుతున్న విద్యుత్‌ తీగలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన అన్నారు.